# ఆలయాల అభివృద్ధికి కృషి



నాందార్‌ఖాన్‌పేట్‌లో బొడ్రాయి పండుగకు రూ.లక్ష విరాళం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, మే 12 : ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19న షాబాద్ మండలంలోని నాందార్ ఖాన్‌పేట్‌లో నిర్వహించే బొడ్రాయి ఉత్సవాలకు హాజరు కావాలని సోమవారం గ్రామస్తులు అవినాశ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. అనంతరం బొడ్రాయి ఉత్సవాలకు తనవంతు సహాయంగా అవినాశ్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పొన్న నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పొన్న వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

ఆమనగల్లు, మే 12 : మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్ మాతృమూర్తి చుక్క బాలమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం బాలమ్మ మృతదేహన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు నిరంజన్ గౌడ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, సీనియర్ నాయకులు ఎంగలి రఘు, గుత్తి బాలస్వామి, పంతునాయక్, శ్రీనునాయక్, రమేశ్‌నాయక్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల రూరల్, మే 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి డిమాండ్ చేశారు. సోమవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని రామన్నగూడ వార్డులో సీపీఐ గ్రామ శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమలు కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, నాయకుడు మక్బూల్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మీనాక్షి పాల్గొన్నారు.

**నూతన కమిటీ..**

రామన్నగూడెం సీపీఐ గ్రామ శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కార్యదర్శిగా డి.పాపయ్య, సహాయ కార్యదర్శిగా కిష్టయ్య, అన్వర్, కమిటీ సభ్యులుగా బాలయ్య, రఫిక్, యూసుఫ్, నర్సింహులు, తాజ్, అంజయ్య, వడ్డే నర్సింహులు, వడ్ల నగేశ్, శ్యామలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

- ఎంపీడీవో బాలశంకర్
- ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన



ఆరుట్ల పాఠశాల ఆవరణలో చేపట్టిన సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మంచాల, మే 12 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీడీవో బాలశంకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు చెప్పారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు పూర్వ విద్యార్థులు, దాతలు ముందుకొచ్చి పాఠశాల అభివృద్ధికి సహకరించడంతో ఆయన అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ సభ్యులు కంబాలపల్లి భాస్కర్, చిందం శ్రీశైలం, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్‌టీఎల్ పరిధిలో డంప్ చేసిన మట్టి తొలగింపు



గంగరాయని చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగిస్తున్న అధికారులు

తుర్కయాంజాల్, మే 12 : మన్నెగూడ రెవెన్యూ పరిధిలోని గంగరాయని చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో డంప్ చేసిన మట్టిని సోమవారం ఇరిగేషన్ అధికారులు తొలగించారు. సర్వే నెంబర్ 7, 8, 9, 10లోని 3 ఎకరాల 5 గుంటల పొలానికి కొందరు వ్యక్తులు ఇటీవల ఎన్‌వోసీ తెచ్చుకున్నామని చెబుతూ మట్టిని డంప్ చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ డీఈ చెన్నకేశవరెడ్డి, ఏఈ వంశీధర్ గంగరాయని చెరువును పరిశీలించారు. ఎన్‌వోసీ పొందిన పొలంలో కాకుండా ఎఫ్‌టీఎల్ పరిధిలో డంప్ చేసిన మట్టిని జేసీబీ సాయంతో తొలగించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ డీఈ మాట్లాడుతూ.. గంగరాయని ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిని డంప్ చేసినట్లు గుర్తించి తొలగించామన్నారు. ఎన్‌వోసీ పొందిన పొలానికి పూర్తిస్థాయిలో ఎఫ్‌టీఎల్, బఫర్ పరిధులను నిర్ణయించే వరకు మట్టిని డంప్ చేయరాదని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే ఎన్‌వోసీని రద్దు చేస్తామన్నారు.

## ఎరువులు మోతాదు మించితే నష్టమే..



ఉప్పరిగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త కిరణ్‌బాబు

ఇబ్రహీంపట్నం, మే 12 : సరైన మెళకువలు, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలని, ఇబ్బడి మబ్బడిగా మందులు పిచికారీ చేస్తే పంట నష్టం తీవ్రమయ్యే అవకాశముందని వ్యవసాయ శాస్త్రవేత్త సునీత అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని ఉప్పరిగూడ సహకార సంఘం కార్యాలయంతో పాటు రాయపోల్‌లో రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్‌బాబు, సునీత మాట్లాడుతూ... రైతులు పంటల మార్పిడి విధానం పాటించాలని సూచించారు. కార్యక్రమంలోఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ పాండురంగారెడ్డి, వ్యవసాయాధికారి విద్యాదరి, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, సృజన పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తాం

యాచారం, మే 12 : మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ, ఎంపీవో శ్రీలత పంచాయతీ అధికారులతో కలిసి సోమవారం పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారిందని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వారు పర్యటించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై గ్రామస్తులతో చర్చించారు. మురుగు ఇండ్ల మధ్య పారుతుండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



నానక్‌నగర్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

# కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సన్మానం



నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి రమాకాంత్‌ను సన్మానిస్తున్న ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్

ఆమనగల్లు, మే 12: నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.రమాకాంత్ నూతనంగా భాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అండేకార్ యాదిలాల్ ఆధ్వర్యంలో సోమవారం అసోసియేషన్ సభ్యులు ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జమీల్, కోశాధికారి కృష్ణ, న్యాయవాదులు ఆంజనేయులు, శ్రీనివాస్, శిరీశ్, శ్రీశైలం, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తాం



చేవెళ్ల రూరల్ : ఆర్డీవో చంద్రకళకు వినతిపత్రం అందజేస్తున్న అంతారం గ్రామస్తులు

చేవెళ్లటౌన్, మే 12: ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సత్తరమే పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ తెలిపారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సంధ్య, ఆపరేటర్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ భూమిని కాపాడాలి**

**చేవెళ్ల రూరల్ :** ప్రభుత్వ భూములను కబ్జాల చెర నుంచి విడిపించి విముక్తి కల్పించాలని చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఆర్డీవో చంద్రకళను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. అంతారం గ్రామ రెవెన్యూలోని 185 సర్వే నంబర్‌లో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేశారన్నారు. అసైన్డ్ భూమిని రైతుల వద్ద నుంచి అన్యాయంగా లాక్కొని వారిని పక్కకు జరిపి ఏకంగా ఫాం హౌస్‌లు, కబ్జాచేసిన భూమిలో ప్రికాస్ట్ ఏర్పాటు చేశారన్నారు. భూ సర్వే చేసి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, ఎన్.సంజయ్య గౌడ్, కృష్ణ ఉన్నారు.

## కోళ్ల ఫారంలో ప్రమాదం.. వ్యక్తి మృతి

కేశంపేట, మే 12 : కోళ్ల ఫారంలోని దాన యంత్రం సరి చేసే క్రమంలో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కేశంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కాకునూరు గ్రామానికి చెందిన నీల్యానాయక్ (55) కోళ్లఫారాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం కురిసిన వర్షం, భారీ ఈదురుగాలులకు కోళ్ల ఫారంలోని దాన యంత్రాన్ని సరి చేసే క్రమంలో ఒక్కసారిగా నీల్యానాయక్‌పై పడింది. దీంతో క్షతగాత్రుడిని 108 సహాయంతో షాద్‌నగర్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వైద్యుల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. నీల్యానాయక్ మృతితో షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తోపాటు కేశంపేట మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్, పీఏసీఎస్ కొత్తపేట చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, మాజీ సర్పంచులు వెంకట్‌రెడ్డి, బాలరాజ్ గౌడ్, నాయకులు రమేశ్‌గౌడ్, కోటేశ్వర్, జమాల్, రామకృష్ణ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. నీల్యానాయక్ మృతి పార్టీకి తీరని లోటని కొనియాడారు. కోళ్ల ఫారంలో పని చేసే కమల్‌సాదా అనే కార్మికుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కేశంపేట సీఐ నరహరి తెలిపారు.

## గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరి



నజీబ్‌నగర్‌లో పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ దేవీరెడ్డి

మొయినాబాద్, మే 12 : రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని నజీబ్‌నగర్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయిస్తే పశువుల్లో సీజనల్ వ్యాధులు రావన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ డే



కేక్ కట్ చేస్తున్న నర్సింగ్ సిబ్బంది

ఆమనగల్లు, మే 12 : ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన ఆవరణలో అంతర్జాతీయ నర్సింగ్ డే ను పురస్కరించుకుని వైద్యాధికారులు నాగరాజు, మంజులాదేవి, మైమునా బేగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం నర్సింగ్ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ సిబ్బంది యేసుమని, హెక్సిబా, సునీత, రత్నజ్యోతి, గాయత్రి, అలివేలు, నాగేశ్వరి, వీణ, నీరజ, భారతమ్మ, తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, రవికుమార్, వేణు, శ్రీను ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సీపీఎం నాయకుల ముందస్తు అరెస్ట్



సీపీఎం నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

మంచాల, మే 12 : హైదరాబాద్‌లో జరుగుతున్న అందాల పోటీల సందర్భంగా సోమవారం మధ్యాహ్నం నాగార్జునసాగర్‌లోని బుద్ధవనానికి వెళ్తున్న అందాల పోటీ దారులను అడ్డుకుంటారని మంచాలలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి రావుల జంగయ్యను ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఒకపక్క చెబుతూ.. మరో పక్క అందాల పోటీలకు కోట్లాది రూపాయలు వెచ్చించడం సిగ్గుచేటన్నారు. అరెస్ట్ అయిన వారిలో సీపీఎం నాయకులు కొర్రెంకల నర్సింహ, కందుకూరి జగన్, శ్యాంసుందర్, ఆవుల యాదయ్య, చందునాయక్, జంగయ్య ఉన్నారు.

# 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



సార్వత్రిక సమ్మె వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య

కడ్తాల్ (తలకొండపల్లి) మే 12 : కేంద్ర ప్రభుత్వం కార్మికుల కోసం ఇటీవల చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, గతంలో ఉన్న 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 20 న సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమ్మెకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను స్థానిక కార్మికులు, నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

# కోనాపూర్‌లో ఇంటర్ విద్యార్థికి సన్మానం



ఆమనగల్లు, మే 12 : కోనాపూర్ గ్రామానికి జల్లెల్ల తిరుపతయ్య, పెద్దమ్మ కుమారుడు జల్లెల్ల శివ ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 1000 మార్కులకు 990 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు జల్లెల్ల శివను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో అత్యుత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలనిఆశాభావం వ్యక్తం చేశారు. సన్మానించిన వారిలో జగన్ తదితరులు ఉన్నారు.

## వేసవిలో పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

**సీఐ నరహరి**



కేశంపేట, మే 12: ప్రస్తుత వేసవికాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కేశంపేట సీఐ నరహరి అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం సీఐ మాట్లాడుతూ.. పాఠశాలలకు వేసవి సెలవులు రావడంతో చిన్నారులు అధికంగా స్విమ్మింగ్ చేసేందుకు వెళ్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పిల్లలకు స్విమ్మింగ్ నేర్పించే క్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలకు బయటకు రావద్దని, అత్యవసరమైతేనే ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు రావాలన్నారు. వడ గాలి నుంచి ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు చల్లటి కుండ తదితర పాత్రలు ఉపయోగించాలని, వడ దెబ్బ నుంచి రక్షణ కోసం నిమ్మకాయలను జ్యూస్‌గా తయారు చేసి సేవించాలన్నారు. చెరువులు, కుంటల్లో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. తల్లిదండ్రులు ఎవరూ తమ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, ఏదైనా ప్రమాదం జరిగితే వాహనాలు ఇచ్చిన వ్యక్తితోపాటు మైనర్లకు చట్టపరమైన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు, మే 12 : ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించిన, కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి



చేవెళ్ల రూరల్ : మాట్లాడుతున్న శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్

చేవెళ్ల రూరల్, మే 12 : అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందజేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ సూచించారు. సోమవారం శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల అర్హులు, అనర్హుల జాబితాపై క్లారిటీ ఉండాలని, రాజీవ్ యువ వికాస్ పథకానికి సంబంధించిన దరఖాస్తులు, కవరింగ్ లెటర్‌ను మంగళవారం బ్యాంకుల్లో అందజేయాలని సూచించారు. అలాగే గ్రామ పంచాయతీల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, ప్లాస్టిక్ నిషేధం, మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ కూలీలకు వసతులు పెంచాలని అధికారులు, సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

**చేవెళ్లలో..**

**చేవెళ్లటౌన్ :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో అధ్యక్షతన ఇందిరమ్మ ఇండ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయడంతో మెటీరియల్ ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, పీఆర్ ఏఈ, ఏపీవో తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



కడ్తాల్‌లో విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల్, మే 12: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కడ్తాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు క్యామ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలను ఏబీవీపీ నాయకులు సందర్శించగా నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు పాఠశాలను బంద్ చేయించి విద్యార్థులను ఇంటికి పంపించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నదని ఎంఈవోకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లండం మల్లేశ్, గోరటి భరత్, విజయ్‌కుమార్, కడ్తాల్ నగర కార్యదర్శి పవన్, సీనియర్ నాయకులు శ్రీకాంత్, సాయి, కిశోర్, శ్రీకాంత్, విష్ణు, ధర్మేందర్, మున్నా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

మొయినాబాద్, మే 12 : హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో ఉన్న పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాలలో పని చేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జాజాల రుద్రకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల గేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. జీవో నంబర్ 25 ప్రకారం స్కూల్ బస్‌ల డ్రైవర్లు, క్లీనర్లు, ఆయాల వేతనాలు చెల్లించకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుబడిన వాహనాలకు వేలం



ఆమనగల్లులో వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఆమనగల్లు, మే 12 : ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల్ మండలాల్లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఆమనగల్లు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో డీపీ రంగారెడ్డి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జిల్లా అధికారి ఉజ్వలరెడ్డి సారథ్యంలో వేలం పాట నిర్వహించారు. 8 వాహనాల వాల్యువేషన్ రూ.2.66 లక్షలు కాగా వేలం పాట ద్వారా రూ. 4.91 లక్షలు వచ్చినట్లు, ఈ డబ్బులను ట్రెజరీలో డిపాజిట్ చేశామని సీఐ బద్యానాయక్ తెలిపారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస్ పథకంలో దివ్యాంగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి దివ్యాంగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నర్సింహాచారి, జిల్లా నాయకుడు సురేశ్ వినతిపత్రం అందజేశారు. - మొయినాబాద్, మే 12